

సదరం శిబిరంలో ఎక్కువ పరీక్షలు చేయాలి 8లో..

ఎంపీపీ పీఠం కోసం క్యాంప్ రాజకీయం 8లో..

# ముమ్మరంగా ఆన్‌లైన్



ఆన్‌లైన్ నమోదు ప్రక్రియను పర్యవేక్షిస్తున్న కలెక్టర్

- ప్రజాపాలన దరఖాస్తుల కంప్యూటరీకరణ
- ఈనెల 17వ తేదీ లోపు పూర్తి చేయాలని ఆదేశాలు
- జిల్లా వ్యాప్తంగా 3,24,532 దరఖాస్తులు
- తప్పులు లేకుండా ఎంట్రీ చేయించే బాధ్యత కార్యదర్శులదే

జగిత్యాల, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించిన ప్రజాపాలన కార్యక్రమంలో వచ్చిన దరఖాస్తులను కంప్యూటరీకరణ చేసే పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. జిల్లా వ్యాప్తంగా పలు మున్సిపల్ కార్యాలయాలు, మండల కార్యాలయాల్లో రెండు రోజులుగా ఆన్‌లైన్ పనులు జరుపుతున్నారు. కలెక్టర్ షేక్ యాస్మిన్ బాషా పర్యవేక్షణలో ప్రజాపాలన దరఖాస్తుల నమోదు కార్యక్రమాన్ని చురుకుగా నిర్వహిస్తున్నారు. ఇందు కోసం ప్రత్యేకంగా 542 కంప్యూటర్లు, ఆపరేటర్లను ఏర్పాటు చేశారు. ప్రతీ రోజు రెండు షిఫ్టుల్లో సిబ్బంది ఆన్‌లైన్ నమోదు చేస్తున్నారు.

## ప్రజాపాలన దరఖాస్తులు ఇలా...

జిల్లా వ్యాప్తంగా నిర్వహించిన ప్రజాపాలన కార్యక్రమంలో 3,24,532 దరఖాస్తులను అధికారులు స్వీకరించారు. ఇందులో గ్రామాల్లో 2,49,279 దరఖాస్తులు, మున్సిపాలిటీల్లో 75,253 దరఖాస్తులు స్వీకరించారు. బీర్‌పూర్ మండలంలో 7,044, బుగ్గారంలో 7,630, ధర్మపురిలో 13,574, గొల్లపల్లిలో 16, 255, ఇబ్రహీంపట్నంలో 13,654, జగిత్యాల రూరల్ మండలంలో 18,013, జగిత్యాల అర్బన్ మండలంలో 3, 670, కథలాపూర్‌లో 16,194 దరఖాస్తులు వచ్చాయి.

అదేవిధంగా కొడిమ్యాలలో 14,797, కోరుట్లలో 13,126, మల్లాపూర్‌లో 17,559, మల్యాలలో 15,793, మేడిపల్లిలో 17,288, మెట్‌పల్లిలో 15,507, పెగడపల్లిలో 14,704, రాయికల్‌లో 17,213, సారంగపూర్‌లో 8,258, వెల్గటూరులో 18,000ల దరఖాస్తులు స్వీకరించారు. జిల్లాలోని ధర్మపురి మున్సి పల్‌లో 4,922, జగిత్యాల మున్సిపల్‌లో 25,620, కోరుట్ల మున్సిపల్‌లో 23,758, మెట్‌పల్లి మున్సిపల్‌లో 15,939, రాయికల్ మున్సిపల్‌లో 5,014 దరఖాస్తులు ప్రజాపాలన కార్యక్రమాల్లో స్వీకరించారు.

## 1,49,783 దరఖాస్తుల డిజిటలైజేషన్...

జిల్లాలో ఇప్పటికే 1,49,783 దరఖాస్తుల డిజిటలై జేషన్ పూర్తి చేశారు. ఇందులో ఈనెల 5వ తేదీన 1,660 దరఖాస్తులు, 6వ తేదీన 18,596 దరఖాస్తులు, 7వ తేదిన 71,518 దరఖాస్తులు, 8వ తేదిన 58,009 దరఖాస్తులను డిజిటలైజేషన్ చేశారు. కాగా జిల్లాలోని బీర్‌పూర్‌లో 3,426 దరఖాస్తులు, బుగ్గారం 4,777, ధర్మపురి 5,099, గొల్లపల్లి 7,516, ఇబ్రహీం పట్నం 4,954, జగిత్యాల రూరల్ 11,454, జగిత్యాల 2,859, కథలాపూర్ 5,134, కొడిమ్యాల 9,547, కోరుట్ల 5905 దరఖాస్తులను ఆన్‌లైన్ పూర్తి చేశారు.

అదే విధంగా మల్లాపూర్ మండలంలో 8,224 దరఖాస్తులు, మల్యాల 7,651, మేడిపల్లి 8,359, మెట్‌పల్లి 8,647, పెగడపల్లి 7,560, రాయికల్ 8,753, సారంగపూర్ 4,823, వెల్గటూరు మండలంలో 8,399 దరఖాస్తులను డిజిటలైజేషన్ చేశారు. ఇదిలా ఉండగా జిల్లాలోని ధర్మపురి మున్సిపల్‌లో 2,628 దరఖాస్తులు, జగిత్యాల మున్సిపల్‌లో 10,861, కోరుట్ల మున్సిపల్‌లో 4,607, మెట్‌పల్లి మున్సిపల్‌లో 4,973, రాయికల్ మున్సిపల్ 2,627 దరఖాస్తులను డిజిటలైజేషన్ చేశారు.

## పలు ప్రభుత్వ కార్యాలయాల్లో నమోదు..

జిల్లాలోని పలు గ్రామపంచాయతీలు, మం డల పరిషత్, రెవెన్యూ, మున్సిపల్ కార్యాల యాల్లో నమోదు ప్రక్రియ జరుపుతున్నారు. ప్రజాపాలన కార్యక్రమంలో ఏర్పాటు చేసిన కౌంటర్లలో దరఖాస్తులు తీసుకుని అక్కడే ఎవరి పేరుతో వచ్చిందో వారి చిరునామా, ఇతర వివరాలను రిజిస్టర్‌లో నమోదు చేసి రసీదు ఇచ్చారు. ఎనిమిది రోజుల పాటు నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా వ్యాప్తంగా సుమారు మూడు లక్షలకు పైగా వినతులు వచ్చాయి. ఇందులో మహాలక్ష్మి పథకం, రూ. 500 గ్యాస్ సిలిండర్ కోసం ఎక్కువ దరఖాస్తులు వచ్చాయి.

తర్వాత ఇందిరమ్మ ఇళ్లు, గృహజ్యోతి పథకం కింద ప్రతీ నెల 200 యూనిట్ల ఉచిత విద్యుత్ కావాలని అర్జీలు పెట్టుకున్నారు. వచ్చిన దరఖాస్తుల నమోదు వేగవంతంగా సాగుతోందని నిర్ణీత సమయంలో పూర్తి చేసేలా దిశగా అధికారులు పని చేస్తున్నారు. కాగా ప్రజాపాలన కార్యక్రమంలో వచ్చిన దరఖా స్తుల ఆన్‌లైన్ నమోదు ప్రక్రియలో మీ సేవా కేంద్రం ఆపరేటర్లను భాగస్వాములను చేస్తున్నారు. పనులు వేగవంతంగా పూర్తి కావడానికి ప్రయత్నాలు చేస్తున్నప్పటికీ ప్రభుత్వ ఉద్యోగులు, సిబ్బందితో కాకుండా ప్రైవేటు ఆపరేటర్లతో పనులు చేయించడం విమర్శలకు తావిస్తోంది.

## సుమారు వెయ్యి మంది ఆపరేటర్లతో..

ప్రజాపాలన ముగియడంతో వచ్చిన దరఖాస్తులను ఆన్‌లైన్‌లో నమోదు అంశంపై అధికారులు దృష్టి సారించారు. కార్యక్రమం ముగిసే ఒకరోజు ముందు నుంచే నమోదు ప్రక్రియ ప్రారంభించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రత్యేకంగా రూపొందించిన వెబ్‌సైట్‌లో దరఖాస్తుల్లోని అంశాలు నమోదు చేస్తున్నారు. ఇందుకోసం ఎంపీడీవో, తహసీల్దార్, మెప్మా, డీఆర్‌డీఏ, మున్సిపల్ తదితర శాఖల్లో పనిచేసే సుమారు వెయ్యి మంది కంప్యూటర్ ఆపరేటర్లకు బాధ్యత అప్పగించారు.

ఒక్కో ఆపరేటర్‌కు 50 దరఖాస్తులు పూర్తి చేసేలా నిర్దేశించారు. వారు 27 అంశాలను పథకాల వారీగా ఆన్‌లైన్‌లో నమోదు చేయాల్సి ఉంటుంది. వారి పేరుతో ప్రత్యేకంగా లాగిన్ కేటాయించి సెల్‌ఫోన్ నంబరుకు వచ్చే ఓటీపీ సాయంతో వివరాలు నమోదు చేసేలా చర్యలు చేపడుతున్నారు. ప్రక్రియ చివరలో వివరాలు నమోదు చేసిన ఆపరేటర్ పేరు వస్తుంది. ఈ ప్రక్రియ పూర్తయిన అనంతరం దరఖాస్తుపై ఎర్ర రంగుతో టిక్ చేస్తారు. దరఖాస్తులన్నీ పక్కాగా భద్రపరచాలన్న ఆదేశాలు ఉన్నాయి. ప్రజాపాలన దరఖాస్తుల ఆన్‌లైన్ నమోదు ప్రక్రియ ఈ నెల 17వ తేదీలోపు పూర్తి కావాలని ఆదేశాలు రావడంతో సెలవు రోజుల్లోనూ సిబ్బంది పనిచేస్తున్నారు. ఆదివారం వరకు సుమారు 25, 000 దరఖాస్తులను ఆన్‌లైన్‌లో నిక్షిప్తం చేశారు. ఎంపీడీవోలు, తహసీల్దారు, మున్సిపల్ కమిషనర్లు, ఇంజనీరింగ్ అధికారుల పర్యవేక్షణలో నమోదు చేపడుతున్నారు.



ప్రజాపాలన దరఖాస్తులను ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్న ఆపరేటర్లు

## ఆన్‌లైన్ నమోదు పూర్తయితేనే పరిశీలన...

ప్రజాపాలన కార్యక్రమంలో స్వీకరించిన దరఖాస్తుల ఆన్‌లైన్ నమోదు ప్రక్రియ పూర్తయితేనే పరిశీలనను ముందుకు తీసుకవెళ్లనున్నట్లు తెలుస్తోంది. జిల్లాలో ఎంతమంది ఏఏ సంక్షేమ పథకం కావాలనుకుంటున్నారు అన్న వివరాలు వెల్లడి అయిన అనంతరం అర్హులను గుర్తించే కార్యక్రమం నిర్వహించాలన్న ఆలోచనతో అధికారులున్నారు. అధికారులు దరఖాస్తుల వివరాలను నమోదు చేసి ప్రభుత్వానికి నివేదిస్తారు. క్షేత్రస్థాయిలో పరిశీలన జరిపి అర్హుల గుర్తింపు నిర్వహించడానికి ప్రస్తుతం చేపట్టిన ఆన్‌లైన్ నమోదు ఉపయోగపడనుంది. అయితే సర్వే ఎప్పుడు చేస్తారు.. లబ్ధిదారులు ఎప్పుడు ఎంపిక అవుతారు..దీనికి ప్రాతిపదిక ఏమిటీ... ఏయే అర్హతలు చూస్తారు...ఆధార్ కార్డు, తెల్లరేషన్ కార్డుల్లో దేనిని పరిగణలోకి తీసుకుంటారనే అంశాలపై ఇంకా స్పష్టత రాలేదు. ఒకవేళ తెల్లరేషన్ కార్డును ప్రామాణికంగా తీసుకుంటే ప్రస్తుత కార్డులు లేని వారి సంగతేమిటి అన్న ఆందోళన సంబంధిత వర్గాల్లో నెలకొంది.

## పర్యవేక్షణాధికారుల నియామకం

జిల్లాలో ప్రతీ నియోజకవర్గం, మండలం, గ్రామానికి ఒక్కో ప్రత్యేక అధికారి చొప్పున నియమించారు. ఎంపీడీవోలు, తహసీల్దార్లు రెండు బృందాలుగా విడిపోయి గ్రామ సభలు నిర్వహించారు. పట్టణాల్లో మున్సిపల్ కమిషనర్, ఆ శాఖలో పనిచేసే ఇంజనీరింగ్ అధికారులు, ఉద్యోగులు భాగస్వాములయ్యారు. ప్రస్తుతం వారంతా దరఖాస్తుల ఆన్‌లైన్ నమోదు ప్రక్రియను పర్యవేక్షిస్తున్నారు. ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా ప్రక్రియ పూర్తి చేయాలని జిల్లా అధికార యంత్రాంగం ప్రయత్నం చేస్తోంది. ఇందుకు అనుగుణంగా ఇటీవల జిల్లా కేంద్రంలో ఆపరేటర్లు, ఉద్యోగులు, సిబ్బందికి ప్రత్యేక అవగాహన సమావేశం నిర్వహించి దిశానిర్దేశం చేశారు.

## పకడ్బందీగా ఆన్‌లైన్ నమోదు



**షేక్ యాస్మిన్ బాషా, కలెక్టర్**

జిల్లాలో ప్రజాపాలన కార్యక్రమంలో స్వీకరించిన దరఖాస్తుల ఆన్‌లైన్ నమోదు ప్రక్రియను పకడ్బందీగా నిర్వహిస్తున్నాము. ఇందుకు ప్రత్యేక సిబ్బందిని, కంప్యూటర్లను ఏర్పాటు చేశాము. నిర్ణీత లక్ష్యం ప్రకారం కార్యక్రమాన్ని ముమ్మరంగా చేసున్నాము. జిల్లాలో వివిధ స్థాయిల్లో నియామకమైన అధికారులు పర్యవేక్షణ చేస్తున్నారు. ఎలాంటి తప్పులు లేకుండా ఆన్‌లైన్ నమోదు పూర్తి చేస్తాము.

## లక్ష్యం మేరకు డిజిటలైజేషన్ పూర్తి చేస్తాం



**దేవరాజు, జిల్లా ప్రజాపాలన నోడల్ ఆఫీసర్, డీపీవో**

జిల్లాలో ప్రజాపాలన దరఖాస్తుల డిజిటలైజేషన్ కార్యక్రమాన్ని లక్ష్యం మేరకు పూర్తి చేస్తాము. ఇప్పటికే జిల్లా వ్యాప్తంగా చురుకుగా డిజిటలైజేషన్ నిర్వహిస్తున్నాము. కలెక్టర్ షేక్ యాస్మిన్ బాషా పర్యవేక్షణలో అన్ని మండలాలు, మున్సిపాలిటీల్లో ప్రత్యేక సిబ్బంది సహకారంతో ఎలాంటి పొరపాట్లు లేకుండా దరఖాస్తులను ఆన్‌లైన్ చేస్తున్నాము. ఏ రోజుకు ఆ రోజు టార్గెట్‌లను నిర్ణయించుకొని ప్రక్రియ నిర్వహిస్తున్నాము.

## నెలాఖరులోపు సీఎంఆర్ పూర్తి చేయాలి

- మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి



వీడియో కాన్ఫరెన్స్‌కు హాజరైన కలెక్టర్, అదనపు కలెక్టరు

జగిత్యాల, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): ఈ నెలాఖరులోపు సీఎంఆర్ వంద శాతం పూర్తి చేయాలని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అధికారులను ఆదేశించారు. సోమవారం హైద్రాబాద్‌లోని సచివాలయం నుంచి సీఎస్ శాంతి కుమారితో కలిసి జిల్లా కలెక్టర్లు, ఇతర అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడారు. 2022-23 వానాకాలం, యాసంగి సీజన్‌లకు సంబంధించిన సీఎంఆర్ డెలివరి, ప్రజాపాలన దరఖాస్తుల ఆన్‌లైన్ నమోదు వంటి అంశాలపై అధికారులు దృష్టి సారించాలన్నారు. రేషన్ బియ్యం రీసైక్లింగ్ కాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పెండింగ్ ధాన్యం కొనుగోలులో జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. పెండింగ్‌లో ఉన్న వానాకాలం ధాన్యం కొనుగోలును త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ షేక్ యాస్మిన్ బాషా, అదనపు కలెక్టర్లు బీఎస్ లత, దివాకర, డీఆర్‌డీవో నరేశ్, అధికారులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు వార్షిక పరీక్షలు అయ్యేవరకు అల్పాహారం

బీర్‌పూర్, జనవరి 8: కళాశాలలో విద్యార్థులకు వార్షిక పరీక్షలు పూర్తయ్యే వరకు కళాశాలలోనే ప్రతీరోజు అల్పాహారం అందిస్తామని జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి నారాయణ అన్నారు. సోమవారం బీర్‌పూర్ మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మధ్యాహ్నం సమయంలో అల్పాహారం అందించే కార్యక్రమాన్ని నారాయణ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వార్షిక పరీక్షలు ప్రారంభమైన తరుణంలో సోమవారం నుంచి పరీక్షలు ముగిసేవరకు ప్రతీరోజు మధ్యాహ్న సమయంలో అల్పాహారం అందిస్తామని తెలిపారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకొని పరీక్షల్లో మంచి మార్కులు సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఎంపీపీ మసర్తి రమేష్, సర్పంచ్ శిల్ప రమేష్, కళాశాల ప్రిన్సిపాల్ రామకృష్ణ, అధ్యాపకులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## మోడల్ స్కూల్‌ను సందర్శించిన ప్యానల్ టీం సభ్యులు



స్వాగతం పలుకుతున్న విద్యార్థినులు

కొడిమ్యాల, జనవరి 8: మండల కేంద్రంలోని మోడల్ స్కూల్, జూనియర్ కళాశాలను సోమవారం ప్యానల్ టీం సభ్యులు సందర్శించారు. ప్రభుత్వ పరంగా అకాడమిక్ అంశాలు అమలవుతున్న తీరును పరిశీలించారు. ఉపాధ్యాయుల బోధన, కార్యాలయపరమైన సీసీఈ వంటి పలు అంశాల నిర్వహణ అమలు తీరుపై సంతృప్తిని వ్యక్తం చేశారు. అంతకుముందు సందర్శించడానికి వచ్చిన టీం సభ్యులను విద్యార్థులు పుష్పగుచ్ఛం అందించి ఘనంగా స్వాగతం పలికారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ బి లావణ్య, టీం సభ్యులు, ప్రిన్సిపాల్స్ డి సరితాదేవి, నాగసుధారాణి, ఎస్ రవి, ఇ రాజ్‌కుమార్, కె శ్రీనివాస్, పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## టీబీ వ్యాధిగ్రస్తులకు కేంద్ర ప్రభుత్వం చేయూత



రికార్డులను పరిశీలిస్తున్న డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ ఎన్ శ్రీనివాస్

మెట్‌పల్లి రూరల్, జనవరి 8: టీబీ లక్షణాలు ఉన్న, మందులు వాడుతున్న వ్యాధిగ్రస్తులకు కేంద్ర ప్రభుత్వం అందించే చేయూతను సద్వినియోగం చేసుకోవాలని డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ ఎన్ శ్రీనివాస్ అన్నారు. సోమవారం మండలంలోని జగ్గసాగర్ గ్రామంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన సందర్శించారు. ఆరోగ్య కేంద్రం ద్వారా అందజేస్తున్న సేవలను సిబ్బందిని అడిగి తెలుసుకుని సంబంధించిన రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను గ్రామీణ ప్రజలకు అవగహన కల్పించి అర్హులైన వారు లబ్ధిపొందడానికి సూచనలు చేయాలన్నారు. కేంద్ర ప్రభుత్వం వైద్య ఆరోగ్యశాఖకు అందిస్తున్న సేవలు, టీబీ వ్యాధిగస్తులకు అందిస్తున్న ప్రోత్సాహకాలను వివరించారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు, నాయకులు, వైద్య సిబ్బంది, గ్రామస్థులు, తదితరులు పాల్గొన్నారు.

## అధైర్య పడకండి.. అండగా ఉంటాం

కొడిమ్యాల, జనవరి 8: రాజకీయాలలో గెలుపు ఓటమిలు సహజమని కరీంనగర్ మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని 3వ ఎంపీటీసీ సామల లక్ష్మన్ ఇంటిలో బీఆర్‌ఎస్ మండల పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి చొప్పదండి మాజీ ఎమ్మెల్యే రవిశంకర్‌తో హాజరైనారు. ఈ సందర్భంగా మాజీ ఎంపీ మాట్లాడుతూ ఓడి పోయామని కుంగి పోవద్దన్నారు. కార్యకర్తలకు ఎల్లవేళలా అందుబాటులో ఉండి అన్ని విదాలుగా ఆదుకుంటామన్నారు. సమావేశంలో ఎంపీపీ స్వర్ణలత, సర్పంచుల ఫోరం మండల అధ్యక్షుడు కృష్ణారావు, సింగిల్ విండో చైర్మన్ రాజనర్సింగరావు, రవీఆందర్‌రెడ్డి, రాజేందర్, మార్కెట్ కమిటీ చైర్మన్ నరేందర్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు ప్రసాద్, పలువురు సర్పంచులు, ఎంపీటీసీలు, కార్యకర్తలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మాజీ ఎంపీ వినోద్‌కుమార్

## ప్రతీ మండలంలో మూడెకరాల ప్రభుత్వ భూమిని గుర్తించాలి

- కలెక్టర్ షేక్ యాస్మిన్ బాషా



సమీక్ష సమావేశంలో పాల్గొన్న అధికారులు

జగిత్యాల, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): ప్రతీ మండలంలో మూడు ఎకరాల ప్రభుత్వ భూమిని గుర్తించాలని కలెక్టర్ షేక్ యాస్మిన్ బాషా అన్నారు. సోమవారం పట్టణంలోని సమీకృత కలెక్టరేట్ కార్యాలయ ఆడిటోరియంలో అధికారులతో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమే మాట్లాడారు. ఎలాంటి సమస్యల లేని భూమి వివరాల ప్రతిపాదనలను ఆర్‌డీఓలు పరిశీలించి పంపించాలని సూచించారు. ప్రజాపాలనకు సంబందించిన దరఖాస్తులన్నింటిని వేగవంతంగా డేటా ఎంట్రీ చేయాలన్నారు. ఎలాంటి తప్పులు లేకుండా నమోదు కార్యక్రమాన్ని నిర్వహించాలని ఆదేశించారు. వచ్చే వారం రోజుల్లోగా డేటా ఎంట్రీ ప్రక్రియ పూర్తి చేయాలని తెలిపారు. అదేవిదంగా ఈనెల 22వ తేదీ వరకు ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమం నిర్వహించాలన్నారు. ఓటరు జాబితాలో చేర్పులు, మార్పులు నిర్ణీత ఫారాలలో చేసుకోవచ్చన్నారు. గ్రామాలు, పట్టణాలు, కళాశాలల్లో ఓటరు నమోదుకు విస్తృత ప్రచారం నిర్వహించాలన్నారు. వచ్చే నెల 8వ తేదిన ముసాయిదా జాబితా ప్రకటిస్తామన్నారు. జిల్లాలోని వివిధ విద్యా సంస్థల యాజమాన్యాలతో చర్చించి అర్హులైన యువత ఓటరు నమోదు చేసుకునేలా అవగాహణ కల్పించాలన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు బీఎస్ లత, దివాకర, జగిత్యాల, మెట్‌పల్లి, కోరుట్ల ఆర్‌డీఓలు నరసింహామూర్తి, రాజేశ్వర్, మధు, ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్ శ్రీనివాస్‌లతో పాటు వివిధ ప్రభుత్వ శాఖలకు చెందిన అధికారులు పాల్గొన్నారు.

### ప్రజావాణి దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలి..

ప్రజావాణి దరఖాస్తులను త్వరితగతంగా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ షేక్ యాస్మిన్ బాషా అన్నారు. సోమవారం పట్టణంలోని సమీకృత కలెక్టరేట్ కార్యాలయ ఆడిటోరియంలో ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి వచ్చిన 60 మంది నుంచి వివిధ సమస్యలపై దరఖాస్తులను స్వీకరించారు. ఈసందర్భంగా ఆమే మాట్లాడారు. ఎన్నో వ్యయ ప్రయాసాలకు ఓర్చి సమస్యల పరిష్కారానికై జిల్లా కేంద్రానికి వస్తున్న ప్రజల దరఖాస్తులను స్వీకరించడంతో పాటు సాధ్యమైనంత తొందరలో పరిష్కారం చూపాలన్నారు. ఈకార్యక్రమంలో అదనపు కలెక్టర్ బీఎస్ లతతో పాటు వివిధ ప్రభుత్వ శాఖలకు చెందిన అధికారులు పాల్గొన్నారు.

## బస్సు సౌకర్యానికి నోచుకోని పల్లెలు

- బస్సులు నడపాలని కోరుతున్న మహిళలు




కొడిమ్యాల, జనవరి 8: రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టి అమలు పరుస్తున్న మహిళలు ఉచిత బస్సు సౌకర్యానికి పలు పల్లెల మహిళలు నోచుకోవటం లేదు. మండలంలోని కొండాపూర్, బొల్లోని చెరువు, గంగారాంతండా, రామరావుపేట, నవాబుపేట గ్రామాలు ఆర్టీసీ బస్సు సౌకర్యం లేదు. మండలంలోని దమ్మయ్యపేట, చింతల్లపల్లి, తిప్పయ్యపల్లి, శ్రీరాములపల్లి, గోపాల్‌రావుపేట, గౌరాపూర్, నర్సింహులపల్లి గ్రామాలకు పదేళ్ల నుంచి ఆర్టీసీ బస్సులు నడవటం లేదని ఆయా గ్రామాల ప్రజలు తెలిపారు. గతంలో బస్సులు నడిపి మధ్యలో మానేసిన గ్రామాలకు ఆర్టీసీ బస్సులు నడవకపోవటంతో చాలా మంది మహిళలు ఉచిత ప్రయాణానికి నోచుకోవటం లేదు. గతంలో మండలంలోని చింతల్లపల్లి, దమ్మయ్యపేట, తిప్పయ్యపల్లి, శ్రీరాములపల్లి, గౌరాపూర్, నర్సింహులపల్లి గ్రామాలకు ఆర్టీసీ బస్సులను నడిపిన సంబంధిత అధికారులు కలెక్షన్ రావటం లేదని బస్సులను నడపటం నిలిపి వేశారు. దీంతో ఈ గ్రామాల ప్రజలు పూడూర్, కొడిమ్యాలకు రావాలంటే నానా ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. కొండాపూర్, బొల్లోని చెరువు గ్రామాలకు రోడ్డు సౌకర్యం ఉన్నప్పటికీ బస్సులను నడపలేదు. పాలకులు పట్టించుకొని సంబందిత అధికారులు విచారణ జరిపి పల్లెలకు ఆర్టీసీ బస్సులు నడపాలని పల్లె మహిళలు, ప్రజాప్రతినిధులు ముక్త కంఠంతో కోరుతున్నారు.

## మల్లికార్జున స్వామిని దర్శించుకున్న భజరంగ్‌దళ్ రాష్ట్ర కన్వీనర్

గొల్లపల్లి, జనవరి 8: ప్రముఖ పుణ్య క్షేత్రమైన మల్లన్నపేటలోని మల్లికార్జున స్వామిని భజరంగ్‌దళ్ రాష్ట్ర కన్వీనర్ శివ రాములు సోమవారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. వారి వెంట జగిత్యాల జిల్లా విశ్వహిందూ పరిషత్ సహ కార్యదర్శి సుభాష్, గో రక్షక్ సహప్రాంక్ నరేష్, భజరంగ్‌దళ్ రాయికల్ ప్రఖండ వినయ్, విశ్వహిందూ పరిషత్ గొల్లపల్లి మండల అధ్యక్షుడు అరుణ్, గౌరవ అధ్యక్షుడు సత్యాచారి, ప్రధాన కార్యదర్శి వెంకటేష్, బీజేపీ గ్రామ శాఖ అధ్యక్షుడు దాసరి మల్లయ్య తదితరులు ఉన్నారు.

## ఉచిత నేత్ర వైద్య శిబిరానికి మంచి స్పందన



ఉచిత వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న దినేష్

ధర్మపురి, జనవరి 8: ధర్మపురి పట్టణంలోని ఓ గార్డెన్స్‌లో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత నేత్ర వైద్య శిబిరాన్ని టీపీసీసీ సభ్యుడు సంగనభట్ల దినేష్ సోమవారం ప్రారంభించారు. ఈ శిబిరానికి హాజరైన చుట్టుపక్కల గ్రామాలకు చెందిన 300 మందికి రేకుర్తి కంటి ఆసుపత్రి వైద్యులు, సిబ్బంది నేత్ర పరీక్షలు నిర్వహించగా మంచి స్పందన లభించింది. ఇందులో 80 మందికి మోతె బిందు కంటి పొరలు ఉన్నట్లు డాక్టర్లు గుర్తించారు. ప్రస్తుతం 32 మందికి ఉచిత బస్ సౌకర్యం కల్పించి ఆపరేషన్ నిమిత్తం రేకుర్తి కంటి ఆసుపత్రికి తరలించారు. ఈ సందర్భంగా లయన్స్ క్లబ్ ధర్మపురి పట్టణ అధ్యక్షుడు సాయిని సత్యనారాయణ మాట్లాడుతూ ఈ నెల 9న వారికి ఆపరేషన్ తిరిగి పంపిస్తామని తెలి పారు. లయన్స్‌క్లబ్ పక్షాన దాదాపు 600 మందికి పైగా ఉచిత కంటి ఆపరేషన్లు నిర్వహిస్తామని వివరించారు. కార్యక్రమంలో ధర్మపురి మున్సిపల్ ఫ్లోర్‌లీడర్ వేముల నాగలక్ష్మి, లయన్స్ క్లబ్ ధర్మపురి పట్టణ వ్యవస్థాపక అధ్యక్షులు జక్కు రవీందర్, అధ్యక్షుడు సాయిని సత్యనారాయణ, కార్యదర్శి అయ్యోరి తిరుపతి, కోశాధికారి సిరుప రాజన్న తదితరులు పాల్గొన్నారు.

## పొలం వద్ద విద్యుత్ తీగ అమర్చిన వ్యక్తి అరెస్టు

చందుర్తి, జనవరి 8: పొలం వద్ద విద్యుత్ తీగలను ఏర్పాటు చేసి ఓ వ్యక్తికి తీవ్రగాయాలు కావడానికి కారణమైన వ్యక్తిని అరెస్ట్ చేసినట్లు సీఐ కిరణ్ కుమార్ తెలిపారు. చందుర్తి పోలీస్‌స్టేషన్‌లో సోమవారం విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. చందుర్తి మండలం రామన్నపేటకు చెందిన బెంద్రపు నరసింహారెడ్డి వర్షిణి దంపతులు గత డిసెంబరు 25న వరినాట్లు వేశారు. వరి నరిపోక పోవడంతో అదే గ్రామానికి చెందిన రైతు తిప్పని రాజయ్యను వరి నారు అడిగారు. సదరు రైతు ఇస్తానని చెప్పడంతో నరసింహారెడ్డి వర్షిణి దంపతులు ఇద్దరూ వరి నారు కోసం రాజయ్య పొలం వద్దకు వెళ్లారు. అక్కడ పొలం చుట్టూ అమర్చిన విద్యుత్ తీగలు నరసింహారెడ్డికి తాకడంతో విద్యుదాఘాతానికి గురయ్యాడు. కాలుకు గాయం కాగా అక్కడే ఉన్న వర్షిణి పక్క పొలంలో ఉన్న మరో రైతు దేవయ్య వద్దకు పరిగెత్తి జరిగిన విషయం చెప్పింది. వెంటనే దేవయ్య ట్రాన్స్‌ఫార్మర్ వద్దకు వెళ్లి విద్యుత్ సరఫరా నిలిపి వేశాడు. బాధితుడిని ఆసుపత్రికి తరలించారు. ఈ సంఘటనపై నరసింహారెడ్డి చందుర్తి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా రాజయ్యపై కేసు నమోదు చేసి అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలిస్తున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో ఎస్సై రాజేష్ ఉన్నారు.

## నివాసాల మధ్య వైన్స్ వద్దు

● వ్యాపారి ఆత్మహత్యాయత్నం



ఆత్మహత్యాయత్నానికి పాల్పడుతున్న వెంగల్‌దాస్ అశోక్

సుభాష్‌నగర్, జనవరి 8: నివాసాలు, వస్త్ర దుకాణాల మధ్యలో వైన్స్ ఏర్పాటు చేయవద్దని కరీంనగర్ కలెక్టరేట్ ఆవరణలో వెంగల్‌దాస్ అశోక్ అనే వ్యాపారి సోమవారం పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. దీంతో ఆయనను పోలీసులు అడ్డుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. కరీంనగర్‌లోని గాంధీరోడ్డులో వైన్స్‌ను ఏర్పాటు చేయవద్దని వస్త్ర వ్యాపారులు సోమవారం ప్రజావాణిలో కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వ్యాపారులు మాట్లాడుతూ 25 సంవత్సరాలుగా గాంధీరోడ్డులో వస్త్ర వ్యాపారం చేస్తున్నామని, వాటి మధ్య వైన్స్‌ను ఏర్పాటు చేస్తున్నారన్నారు. దీంతో తాము అక్కడ వ్యాపారాలు నిర్వహించలేమని, మహిళా కస్టమర్లు వచ్చేందుకు ఇబ్బంది పడుతున్నారన్నారు. దుకాణాల మధ్య వైన్స్ ఏర్పాటు చేయవద్దని గతంలోనూ కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశామన్నారు. దానికి స్పందించిన కలెక్టర్ సబంధిత శాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. వైన్స్ నిర్వాహకులు హైదరాబాద్‌లోని ఎక్సైజ్ కమిషనర్ కార్యాలయం నుంచి అనుమతి తెచ్చుకుని, షాపు ప్రారంభించేందుకు సిద్ధమవుతున్నారని అన్నారు. దీనిని అడ్డుకోవడంతో వైన్స్‌కు సంబంధించిన వ్యక్తులు తమపై దాడులకు పాల్పడ్డారని వారు ఆరోపించారు.

## డ్రంకెన్ డ్రైవ్ కేసులో 23 మందికి జైలు శిక్ష




మాట్లాడుతున్న సీఐ ఉపేందర్

సిరిసిల్ల క్రైం, జనవరి 8: డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడిన 23 మందికి జైలుశిక్ష విధిస్తూ ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ప్రవీణ్ సోమవారం తీర్పు చెప్పారు. సిరిసిల్ల పట్టణ పరిధిలో నిర్వహించిన డ్రంకెన్‌డ్రైవ్‌లో పట్టుబడిన 23 మందికి ఒక రోజు జైలు శిక్ష, రూ.3 వేల జరిమానా, ఐదుగురికి రెండు రోజుల జైలు శిక్ష, రూ.3 వేల జరిమానా, 23 మందికి రూ.3 వేల జరిమానా విధించారు. అనంతరం సిరిసిల్ల పట్టణ సీఐ ఉపేందర్ ఆధ్వర్యంలో ఎస్పీ అఖిల్ మహాజన్ ఆదేశాల మేరకు డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడిన వ్యక్తులకు కౌన్సెలింగ్ ఇచ్చారు. కార్యక్రమంలో ట్రాఫిక్ ఎస్సై రాజు, ట్రాఫిక్ కానిస్టేబుల్ సిబ్బంది పాల్గొన్నారు.

## జాతీయస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు విద్యార్థిని



విద్యార్థినికి ట్రోఫీ అందజేస్తున్న ప్రధానోపాధ్యాయులు

చొప్పదండి, జనవరి 8: జాతీయ స్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు చొప్పదండి జడ్పీ బాలుర పాఠశాల విద్యార్థిని ఎంపికైంది. ఈ నెల 10న రాజస్థాన్‌లోని బికనూర్ పట్టణంలో జరిగే ఎస్‌జీఎఫ్ జాతీయస్థాయి అండర్-17 సాఫ్ట్‌బాల్ పోటీలకు 9వ తరగతి విద్యార్థిని బుర్ర వైష్ణవి ఎంపికైనట్లు ఫిజికల్ డైరెక్టర్ కొమురోజు కృష్ణ తెలిపారు. గత నెల 23 నుంచి 25 వరకు నిర్మల్‌లో జరిగిన రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీల్లో జిల్లా జట్టు తరపున పాల్గొని ప్రతిభ కనబరిచింది. బుర్ర వైష్ణవి, ఫిజికల్ డైరెక్టర్ కృష్ణను పాఠశాల ప్రధానోపాధ్యాయులు వైద్యుల రాజిరెడ్డిని పలువురు అభినందించారు.

## రైస్ మిల్లు నిర్వాహకుడి అరెస్టు

శంకరపట్నం, జనవరి 8: శంకరపట్నం మండలంలోని మొలంగూర్ శివారులో గల పవనసుత ట్రేడర్స్ రైస్ మిల్లు నిర్వాహకుడు ఏనుగుల అనిల్‌ను సోమవారం పోలీసులు అరెస్టు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మొలంగూర్ శివారులోని లలిత ఇండస్ట్రీస్ రైస్‌మిల్లును పవనసుత ట్రేడర్స్ పేరుతో గత కొంత కాలంగా లీజ్‌కు నిర్వహిస్తున్నాడు. ఈ మిల్లుపై సివిల్ సప్లయ్, టాస్క్‌ఫోర్స్ అధికారులు దాడులు చేసి తనిఖీలు నిర్వహించారు. గత సీజన్‌లో ప్రభుత్వం 38,893 క్వింటాళ్ల ధాన్యం మిల్లర్‌కు అందజేసింది. అయితే అనిల్ కేవలం 2,893 క్వింటాళ్ల బియ్యాన్ని సీఎంఆర్ ఇవ్వగా, మిగతా 23,504 క్వింటాళ్ల ధాన్యం మాయమైనట్లు అధికారులు గుర్తించారు. ఇందుకు 55ఏసీకేల బియ్యం ప్రభుత్వానికి అందజేయాల్సి ఉంది. దీంతో అధికారులు నిర్వాహకుడికి పలుమార్లు హెచ్చరికలు జారీ చేశారు. గత అక్టోబరులో పంచనామా నిర్వహించి నోటీసులు ఇచ్చారు. అసలు, వడ్డీ, అదనపు వడ్డీతో కలిపి మొత్తం రూ. 7,18,26,515 జరిమానా విధించి, చెల్లించాలని నోటీసులు ఇచ్చారు. అయినా మిల్లు నిర్వాహకుడు స్పందించకపోవడంతో ఈ నెల 5న సివిల్ సప్లయి డీఎం రజనీకాంత్ ఫిర్యాదు మేరకు అనిల్‌పై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు హుజూరాబాద్ రూరల్ సీఐ సంతోష్ కుమార్ తెలిపారు.

## భూకబ్జాను అడ్డుకున్న రైతులు

జగిత్యాలరూరల్, జనవరి 8: జగిత్యాల అర్బన్ మండలంలోని హస్నాబాద్ - చల్‌గల్ గ్రామాల మధ్యలో గల శ్రీ వెంకటేశ్వర ఆలయానికి వెళ్లే రహదారి భూమిని కబ్జాకు పాల్పడుతున్న వ్యక్తులను హస్నాబాద్ , చల్‌గల్ గ్రామస్థులు సోమవారం అడ్డుకున్నారు. ఈ సందర్భంగా గ్రామస్థులు మాట్లాడుతూ పురాతన కాలంనుంచి వెంకటేశ్వర ఆలయ రహదారికి కోసం రైతుల వద్ద నుంచి కొంత భూమిని సేకరించి రహదారి ఏర్పాటు చేసుకున్నామని చల్‌గల్, హస్నాబాద్ రైతులు పేర్కొన్నారు. దీనిని కొంతమంది వ్యక్తులు రహదారిని చెరిపివేసి భూకబ్జాకు పాల్పడుతున్నారని హస్నాబాద్ రైతులు ఆరోపించారు.

ఆలయానికి పురాతనకాలం నుంచి ఉన్న రహదారిని యథావిధిగా కొనసాగించాలని, అలాగే భూకబ్జాకు పాల్పడుతున్న వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతూ సోమవారం ప్రజావాణిలో హస్నాబాద్ గ్రామస్థులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు.

# సత్యక్కపల్లెలో చిరుతపులుల కలకలం

● భయందోళనలో గ్రామస్థులు


చిరుత పులివిగా అనుమానిస్తున్న గుర్తులు

మెట్‌పల్లి రూరల్, జనవరి 8: మండలంలోని సత్యక్కపల్లె గ్రామ శివారులోని అటవీ ప్రాంతంలో కనిపించిన చిరుతపులి పాదం గుర్తులు సోమవారం కలకలం రేపుతోంది. గ్రామ శివారులోని అటవీ సమీపంలో ఉన్న నీలి చిన్నారెడ్డి అనే రైతు వ్యవసాయ తోటలో చిరుత పులి పాదం గుర్తులుగా భావించి గ్రామస్థులకు సమాచారం అందించాడు. గ్రామంలోని కొందరికి ఇటీవల రెండు రోజుల క్రితం అటవీ ప్రాంతం నుంచి చిరుత తన పిల్లలతో సంచరిస్తూ ఉదయం సమయంలో కనిపించినట్లు, అవి పులులుగా తెలియక ఎవరికి చెప్పలేదని పేర్కొన్నారు. దీంతో గ్రామస్థులు అటవీ శాఖ అధికారులకు సమాచారం అందించారు. డీఆర్‌వో మహ్మద్ హఫీజ్‌ద్దిన్, బీట్ అధికారి శిరాజ్ సంఘటనస్థలాన్ని పరిశీలించారు. ఈ గుర్తులు హైన పాదం అడుగులాగా ఉన్నాయని, చిరుత పులులు కాదని పేర్కొన్నారు. ఏ జంతువు అనేది గుర్తించేందుకు అటవీ పరిసర ప్రాంతంలో పూర్తి నిఘా పెడుతున్నట్లు మహ్మద్ హఫీజోద్దిన్ తెలిపారు.

## సౌదీ అరేబియాలో చందుర్తి వాసి మృతి


నాగయ్య (ఫైల్)

చందుర్తి, జనవరి 8: చందుర్తికి చెందిన కైర నాగయ్య 55 అనే వ్యక్తి సౌదీ అరేబియాలో మృతి చెందాడు. నాగయ్య జీవనోపాధి కోసం 30 సంవత్సరాల నుంచి గల్ఫ్ వెళ్లి వస్తున్నాడు. 10 సంవత్సరాల క్రితం సౌదీ అరేబియా వెళ్లిన నాగయ్యకు నాలుగు రోజుల క్రితం పక్షవాతం రావడంతో అక్కడ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. సోమవారం గుండెపోటు రావడంతో ఆస్పత్రిలోనే మృతి చెందినట్లు తెలిపారు. మృతుడి భార్య గంగవ్వ 20 సంవత్సరాల క్రితమే మృతి చెందినట్లు తెలిపారు. మృతుడికి ముగ్గురు కుమారులు ఉన్నారు.

# భక్తులతో కిక్కిరిసిన వేములవాడ క్షేత్రం


భక్తులతో సందడిగా మారిన రాజన్న ఆలయ ప్రాంగణం


రాజన్న ఆలయంలో భక్తుల రద్దీ

వేములవాడ టౌన్, జనవరి 8: దక్షిణాకాశీగా వీరాజిల్లుతున్న రాజన్న క్షేత్రం భక్తజన సంద్రంగా మారింది. రాజన్నకు అత్యంత ప్రీతిపాత్రమైన సోమవారం కావడంతో భక్తులు, హన్మకొండ, వరంగల్, కరీంనగర్, హుజురాబాద్, హైదరాబాద్, కోరుట్లయ మెట్‌పెల్లి, నిజామాబాద్ జిల్లాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు వేములవాడకు ఆదివారం తరలి వచ్చారు. సోమవారం తెల్లవారు జామున భక్తులు ఆలయ ధర్మగుండంలో పవిత్రస్నానాలు ఆచరించి కళ్యాణకట్టలో తలనీలాలు సమర్పించడంతో పాటు ఓం నమఃశివాయ నామస్మరణతో ఆలయ ప్రాంగాణం మారుమోగిపోయింది. ధర్మదర్శనం, శీఘ్రదర్శనం క్యూలైన్‌లో భక్తులు గంటల తరబడి వేచివుండి ఆలయంలోకి ప్రవేశించి శ్రీ స్వామి వారిని దర్శించుకున్నారు. కోడెటికేట్ క్యూలైన్‌లో వెళ్లిన భక్తులు శ్రీ స్వామి వారి దర్శనం కోసం నాలుగు గంటలు పట్టినట్లు భక్తులు వాపోయారు. రాజన్నకు కోడెను కట్టి మొక్కులు చెల్లించుకున్నారు. అనుబంధ ఆలయాల్లో కుంకుమపూజల్లో పాల్గొన్న భక్తులు బద్దిపోచమ్మ అమ్మవారిని దర్శించుకుని తిరుగుప్రయాణమయ్యారు. రాజన్న ఆలయానికి వచ్చిన భక్తులు ఆలయ ఈవో కృష్ణప్రసాద్ నేతృత్వంలో ఏఈవోలు, సూపరిండెంట్ అల్లి శంకర్, అశోక్, సిరిగిరి శ్రీరాములు ప్రత్యేక చర్యలు చేపట్టారు.

# హుజూరాబాద్‌లో సైబర్ మోసం

హుజూరాబాద్, జనవరి 8: హుజూరాబాద్‌లో సైబర్ మోసం జరిగింది. మున్సిపాలిటీలో పనిచేసే వేల్పుల బాబుకు సోమవారం సెల్‌ఫోన్‌కు ఓ లింక్ రావడంతో ఓపెన్ చేశాడు. దీంతో అతని అకౌంట్‌లోని రూ. 18వేలు ట్రాన్స్‌ఫర్ అయినట్లు మేసేజ్ వచ్చింది. దీంతో హుటాహుటిన బాబు హుజూరాబాద్ పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

## నేడు టగ్ ఆఫ్ వార్, టెన్నికాయిట్ జట్ల ఎంపిక పోటీలు

కరీంనగర్ స్పోర్ట్స్, జనవరి 8: జిల్లా పాఠశాలల క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో కరీంనగర్ జిల్లా స్థాయి అండర్-14, అండర్-17 బాలబాలికల టగ్‌ఆఫ్‌వార్, టెన్నీకాయిట్ ఎంపిక పోటీలను నిర్వహిస్తున్నామని జిల్లా ఎస్‌జీఎఫ్ కార్యదర్శి పోతన శ్రీనివాస్ తెలిపారు. టగ్ ఆఫ్ వార్ ఎంపిక పోటీలను ఉదయం 9 గంటల నుంచి మానకొండూర్ మండలం జడ్పీహెచ్ఎస్ చెంజర్ల పాఠశాలలో నిర్వహించనున్నామని తెలిపారు. టెన్నీకాయిట్ ఎంపిక పోటీలను సప్తగిరికాలనీ ప్రభుత్వ పాఠశాలలో నిర్వహించనున్నట్లు తెలిపారు.



# ఉచితాలు వద్దంటూ ఢిల్లీకి సైకిల్ యాత్ర


కరీంనగర్ నుంచి సైకిల్‌పై ఢిల్లీకి బయల్దేరిన బెల్లపు కరుణాకర్

కరీంనగర్ అర్బన్, జనవరి 8: ఉచితాలు వద్దు.. అంటూ కరీంనగర్ జిల్లా కొత్తపల్లి మండలం చింతకుంటకు చెందిన బెల్లపు కరుణాకర్ అనే యువకుడు సైకిల్‌పై ఢిల్లీకి యాత్ర చేపట్టాడు. సోమవారం కరీంనగర్‌లోని తెలంగాణ చౌక్ నుంచి హైదరాబాద్ ధర్నా చౌక్ మీదుగా దేశ రాజధాని ఢిల్లీ జంతర్‌మంతర్ వరకు సైకిల్‌పై బయల్దేరాడు. 'అనవసరపు ఉచితాలు వద్దు, ప్రామాణిక ప్రభుత్వ విద్య, వైద్యమే ముద్దు' అంటూ సైకిల్‌కు ఒక బోర్డు ఏర్పాటు చేసుకున్నాడు. ప్రభుత్వాలు చేపడుతున్న ఉచిత పథకాలతో సమాజం చిన్నాభిన్నం అవుతుందని నిరసన వ్యక్తం చేస్తూ సైకిల్‌యాత్ర చేపట్టినట్లు కరుణాకర్ తెలిపారు. సైకిల్‌యాత్రలో దారి పొడుగునా ఉచితాలపై నిరసన వ్యక్తం చేస్తూ తన గళాన్ని వినిపించనున్నట్లు ఆయన తెలిపారు. కరుణాకర్ అసెంబ్లీ ఎన్నికల్లో కరీంనగర్ నుంచి స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసి నియోజకవర్గం మొత్తం సైకిల్‌పై తిరుగుతూ ప్రచారం నిర్వహించాడు.

## డిగ్రీ పరీక్షల్లో 14 మంది డీబార్

గణేశ్‌నగర్,జనవరి 8: శాతవాహన విశ్వవిద్యాలయం పరిధిలో జరుగుతున్న డిగ్రీ ఒకటో, మూడో సెమిస్టర్ పరీక్షల్లో సోమవారం 14 మంది విద్యార్థులు డీబార్ అయినట్లు పరీక్షల నియంత్రణ అధికారి డాక్టర్ ఎస్వీ శ్రీరంగ ప్రసాద్ తెలిపారు.

ఒకటో సెమిస్టర్‌లో వాగేశ్వరి డిగ్రీ కళాశాల కరీంనగర్‌లో-4, ఉమెన్స్ డిగ్రీ కాలేజ్, కరీంన గర్‌లో-1, శ్రీశివాని డిగ్రీ కళాశాల సిరిసిల్లలో-1, మూడో సెమిస్టర్‌లో శ్రీ చైతన్య డిగ్రీ కాలేజ్ కరీంనగర్‌లో 1, అల్ఫోర్స్ ఉమెన్స్ డిగ్రీ కాలేజ్ కరీంనగర్‌లో-4, ప్రభుత్వం ఉమెన్స్ డిగ్రీ కాలేజ్ జగిత్యాలలో-2, ప్రభుత్వం డిగ్రీ కళాశాల జమ్మికుంటలో ఒకరు డీబార్ అయినట్లు తెలిపారు.

## ర్యాష్ డ్రైవింగ్‌కు యువకుడి బలి

పెద్దపల్లి రూరల్ , జనవరి 8: ర్యాష్ డ్రైవింగ్‌తో ఓ యువకుడు మృతి చెందిన ఘటన పెద్దపల్లి మండలంలో జరిగింది. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. పెద్దపల్లి మండలంలోని దేవునిపల్లి గ్రామానికి చెందిన హారిక పెద్దకల్వల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శనివారం పరీక్షలు రాసి తన సోదరుడు రాజేష్ (18)తో సాయంత్రం ఇంటికి తిరిగి వెళ్తుండగా అప్పన్నపేట గ్రామానికి చెందిన ఓ యువకుడు ద్విచక్రవాహనంతో ర్యాష్ డ్రైవింగ్ చేస్తూ హారిక, రాజేష్‌ల ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టాడు. దీంతో హారికతో పాటు ఆమె సోదరుడు రాజేష్‌కు తీవ్ర గాయాలు అయ్యాయి. స్థానికులు గమనించి వారిని పెద్దపల్లి ఆసుపత్రికి తరలించారు. రాజేష్‌కు మెరుగైన వైద్యం అందించాలని వైద్యులు సూచించగా కరీంనగర్‌లోని ఓ ప్రయివేట్ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ రాజేశ్ సోమవారం మృతిచెందాడు. హారిక ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు బసంత్‌నగర్ ఎస్ఐ వెంకటేష్ తెలిపారు.

# అధిక రక్తస్రావంతో బాలింత మృతి

● వైద్యుల నిర్లక్ష్యంతోనే అని బంధువుల ఆందోళన


మృతి చెందిన చెకుట పద్మ


రోధిస్తున్న మృతురాలి కుటుంబ సభ్యులు

వేములవాడ టౌన్, జనవరి 8: డెలివరీ కోసం ఆసుపత్రిలో చేరిన గర్బిణీకి పాప జన్మించిన కాసేపటికే అధిక రక్తస్రావం కావడంతో మెరుగైన వైద్యం కోసం కరీంనగర్ తరలించగా మృతి చెందిన సంఘన వేములవాడ మున్సిపల్ పరిధిలోని నాంపల్లి జీవధార ఆసుపత్రిలో సోమవారం చోటు చేసుకుంది. బాధితురాలు కుటుంబ సభ్యులు, బంధువులు తెలిపిన వివరాల ప్రకారం కోనరావుపేట మండలం నిమ్మపెల్లి గ్రామానికి చెందిన చేకుట పద్మ (30) అనే గర్బిణీ పురిటి నొప్పులతో ఆదివారం నాంపల్లి జీవధార ఆసుపత్రిలో చేరింది. దీంతో పద్మకు సోమవారం ఆపరేషన్ చేయగా ఆడబిడ్డకు జన్మనిచ్చింది. కాసేపటికే పద్మకు ఓవర్ బ్లీడింగ్ అవుతోందని కరీంనగర్ తరలించాలని వైద్యులు చెప్పడంతో అక్కడికి తరలిస్తుండగానే మృతి చెందింది. వైద్యుల నిర్లక్ష్యంతోనే బాలింత మృతి చెందిందని కుటుంబ సభ్యులు, బంధువులు మృతదేహాన్ని ఆసుపత్రి వద్దకు తీసుకువచ్చి నిరసన వ్యక్తం చేశారు. విషయం తెలుసుకున్న టౌన్ సీఐ కరుణాకర్‌తో పాటు రూరల్ సీఐలు సంఘటన స్థలానికి చేరుకున్నారు. నిరసన వ్యక్తం చేస్తున్న మృతురాలి బంధువులకు, ఆసుపత్రి యాజమాన్యానికి నచ్చజెప్పి ప్రయత్నం చేసి ఇరువర్గాలను శాంతింపజేశారు. మృతదేహాన్ని అక్కడి నుంచి పోస్టుమార్టం నిమిత్తం సిరిసిల్ల ఏరియా ఆసుపత్రికి తరలించినట్లు బంధువులు తెలిపారు. ఈ విషయంపై వేములవాడ టౌన్ సీఐ కరుణాకర్‌ను వివరణ కోరగా బాధితుల నుంచి ఎలాంటి ఫిర్యాదు అందలేదని సంఘటనపై విచారణ చేసి తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

### మిన్నంటిన కుటుంబ సభ్యుల రోధనలు

పద్మకు పెళ్లి అయినప్పటి నుంచి పిల్లలు కాలేదని, పది సంవత్సరాల తరువాత గర్భం దాల్చితే ఆడబిడ్డకు జన్మనిచ్చి మృతి చెందిందని కుటుంబ సభ్యులు రోదించిన తీరు అక్కడున్న వారిని కంటతడిపెట్టించాయి. ఎంతో వైద్యుల నిర్లక్ష్యంతో మృతి చెందిందని బంధులు రోదించడంతో ఆసుపత్రి ప్రాంగణంలో విశాదం అములుకున్నది.

## నివాస గృహానికి రూ.33వేల కరెంటు బిల్లు

గంభీరావుపేట, జనవరి 8: గంభీరావుపేట మండల కేంద్రంలో నెలసరి కరెంటు బిల్లులు ప్రజలకు చుక్కలు చూపిస్తున్నాయి. నెల నెలా క్రమం తప్పకుండా బిల్లులు చెల్లించే వినియోగదారులకు సైతం వేలల్లో బిల్లులు రావడంతో బెంబేలెత్తుతున్నారు. మండల కేంద్రంలో వరలక్ష్మి అనే మహిళ పేరున ఉన్న విద్యుత్ మీటర్‌పై 33 వేలకు పైగా బిల్లు రావడం చర్చనీయాంశమైంది. అదే విదంగా అనిత పేరు మీద ఉన్న మీటర్‌పై 2 వేలకు పైగా నెలసరి బిల్లు రావడం, ఇలా మామూలు గృహాలకు సైతం వేలల్లో బిల్లులు వస్తున్నాయి.

# కంప్యూటర్ల చోరీపై కొనసాగుతున్న విచారణ

● రంగంలోకి క్లూస్ టీం
● సంఘటన స్థలాన్ని పరిశీలించిన ఏసీపీ


ఎస్ఈ శివకుమార్‌తో మాట్లాడుతున్న ఏసీపీ కరుణాకర్‌రావు

తిమ్మాపూర్, జనవరి8: మండలంలోని మహాత్మానగర్ గ్రామం ఎల్ఎండీ కాలనీలో గల ఇరిగేషన్ శాఖ, ఇరిగేషన్ సర్కిల్-2, డివిజన్ నెం-5 కార్యలయంలో ఆదివారం దొంగతనం జరిగి 4సీపీయులు, 5 మానిటర్లు, రెండు ప్రిటర్లు ఎత్తుకెళ్లిన సంగతి విదితమే. అయితే డివిజన్-5 కార్యాలయంతో పాటుపక్కనే ఉన్న ఇరిగేషన్ శాఖ సర్కిల్-1 కార్యలయంలో కూడా దొంగతనం చేసేందుకు కార్యాలయానికి వేసిన తాళాలను పగల గొట్టినట్లు సోమవారం కార్యలయానికి వచ్చిన సిబ్బంది గమనించి పోలీసులకు సమాచారం అందించారు.

### చోరీపై అనుమానాలు

ఇరిగేషన్ శాఖ డివిజన్ నెంబరు-5 కార్యలయంలో కంప్యూటర్లు చోరీకి గురి కావడంతో ముఖ్యమైన మానేరు రివర్ ఫ్రంట్, దిగువ మానేరు జలాశయం, ట్యాంకుల ముఖ్యమైన పనుల బిల్లులు, రికార్డులు ఈ కార్యలయంలోనే జరుగుతుండటంతో ఆ డాటా కోసం ఏమైనా దొంగిలించారా, లేదా గుర్తుతెలియని వ్యక్తులు ఈ దొంగతానానికి పాల్పడ్డారా అని పలు కోణాల్లో పోలీసులు విచారణ చేపడుతున్నారు.

సోమవారం ఉదయం కార్యాలయానికి ఉద్యోగులు వచ్చే సమయానికి క్లూస్ టీం ఇన్‌చార్జి శ్రీధర్, తిమ్మాపూర్ సిఐ కర్రె స్వామి, ఎల్ఎండి ఎస్సై చేరాలు కలిసి కంప్యూటర్లు దొంగతనం జరిగిన కార్యాలయానికి చేరుకొని విచారణ ప్రారంభించారు. తనిఖీ చేసి అనవాళ్లు, ఫింగర్ ప్రింట్స్ సేకరించారు. ఎస్బి సిఐ సృజన్‌రెడ్డి, ఇంటిలిజెన్స్ సిఐ నరేష్‌రెడ్డి తమ సిబ్బందితో కలిసి వివరాలు సేకరించి, విచారించారు. దొంగతనం జరిగిన కార్యలయంలో ఉన్న ప్రతి ఉద్యోగికి సంబంధిచిన వివరాలు సేకరించారు. ఉద్యోగులను ఎల్ఎండీ పోలీస్‌స్టేషన్‌కు పిలిపించి వారి ఫింగర్ ప్రింట్‌లను సేకరించారు. కార్యాలయ ఉద్యోగులందరినీ ఒక్కొక్కరిగా విచారించారు.

### సంఘటనా స్థలాన్ని పరిశీలించిన ఏసీపీ

చోరీ జరిగిన కార్యాలయాన్ని కరీంనగర్ రూరల్ ఏసీపీ కరుణాకర్ రావు పరిశీలించారు. కంప్యూటర్లలో ఎలాంటి ముఖ్యమైన సమాచారం ఉందనే దానిపై ఇరిగేషన్ ఎస్ఈ శివకుమార్‌తో పాటు ఇతర అధికారులను వివరాలను అడిగి తెలుసుకున్నారు. కంప్యూటర్లలో ఎలాంటి ముఖ్యమైన డాటా లేదని, ఇతర కార్యాలయల్లో కూడా డాటా అందుబాటులో ఉంటుందని, ఎలాంటి ఇబ్బంది లేదని అధికారులు సమాచారం ఇచ్చారు. డివిజన్-5 కార్యలయ అధికారులు కూడా కేవలం 4సీపీయులు, 5 మానిటర్లు, రెండు ప్రిటర్లు గుర్తు తెలియని వ్యక్తులు దొంగిలించినట్లు, డాక్యుమెంట్లు, ఫైల్స్ దొంగతనానికి గురికాలేదని పోలీసులకు ఫిర్యాదు చేశారు.

### మరో కార్యాలయంలో చోరీకి యత్నం

ఇరిగేషన్ సర్కిల్-1 కార్యాలయం తాళాలు పగల గొట్టేందుకు ప్రయత్నించిన ఆనవాళ్లు కనబడటంతో కార్యలయ ఉద్యోగులను లోనికి వెళ్లనివ్వలేదు. ప్రభుత్వ కార్యాలయాల్లో సీసీ కెమెరాలు, నైట్ వాచ్‌మెన్‌లు లేకపోవడంతో చోరీలు జరుగుతున్నాయని ఉద్యోగులు పేర్కొంటున్నారు.

## అల్ఫోర్స్‌లో సంక్రాంతి సంబరాలు

### పాల్గొన్న విద్యాసంస్థల అధినేత నరేందర్‌రెడ్డి



కార్యక్రమంలో పాల్గొన్న నరేందర్ రెడ్డి

జగిత్యాల అర్బన్, జనవరి 8: పట్టణంలోని స్థానిక శివవీధి, కృష్ణానగర్ అల్ఫోర్స్ విద్యాసంస్థల్లో ముందస్తు సంక్రాంతి వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా అల్ఫోర్స్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ నరేందర్ రెడ్డి హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి, వేడుకలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భావి తరాలకు పండగల ఔనత్యాన్ని వివరించేందుకు ప్రతీ పర్వదినాన్ని ఒక వేడుకలాగా నిర్వహిస్తున్నామన్నారు. దీనిలో భాగంగా సంక్రాంతి వేడుకలను ఘనంగా నిర్వహించామన్నారు. కార్యక్రమంలో సుమారు 200 మంది విద్యార్థులు రంగురంగుల సాంప్రదాయ దుస్తుల్లో విచ్చేసి పండగ వాతావరణం కన్నులకు కట్టే విధంగా ఏర్పాటు చేసిన పిండివంటలు, గంగిరెద్దుల ఆటలు అబ్బురపర్చాయి. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

**మల్యాల:** మల్యాల క్రాస్ రోడ్డు వద్ద గల అల్ఫోర్స్ స్కూల్‌లో సోమవారం ముందస్తు సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా సంక్రాంతి వేడుకలు జరిపారు. సంప్రదాయ పిండి వంటలు తయారి చేసి పండగ విశిష్టతను వివరించారు. అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత నరేంధర్‌రెడ్డి, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు

## కాంగ్రెస్ పార్టీలో పలువురి చేరిక



కాంగ్రెస్‌లోకి ఆహ్వానిస్తున్న నర్సింగరావు

ఇబ్రహీంపట్నం, జనవరి 8: మండలంలోని పలు పార్టీలకు చెందిన బీఆర్ఎస్, టీడీపీ నాయకులు సోమవారం కాంగ్రెస్‌లో చేరారు. ఇబ్రహీంపట్నం మండల రైతు సమన్వయ సమితి సభ్యులు అయిలాపూర్ భూమరెడ్డి, టీడీపీ మండల అధ్యక్షుడు గుజ్జుల రమేష్‌లు పార్టీని వీడి కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావు సమక్షంలో పార్టీ కండువా కప్పుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అమలు చేస్తున్న ప్రజా పాలనకు ఆకర్షితులై పార్టీలో చేరుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అల్లూరి మహేంధర్‌రెడ్డి, వెంకటరెడ్డి, శంకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## కేంద్ర పథకాలను సద్వినియోగం చేసుకోవాలి



జగ్గాసాగర్‌లో క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎంపీడీవో భీమేశ్‌రెడ్డి

మెట్‌పల్లి రూరల్, జనవరి 8 : కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలు స్వదినియోగం చేసుకోవాలని ఎంపీడీవో భీమేశ్‌రెడ్డి, బీజేపీ మండలాధ్యక్షుడు కొమ్ముల రాజ్‌పాల్‌రెడ్డిలు అన్నారు. సోమవారం మండలంలోని జగ్గసాగర్ గ్రామంలోని గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద వికసిత్ భారత్ సంకల్పయాత్ర కార్యక్రమం నిర్వహించారు. ప్రధానమంత్రి కిసాన్ సమాన్‌నిధి ఉజ్వల యోజన పథకంలో భాగంగా అర్హులైన వారి నుంచి దరఖాస్తులను స్వీకరించారు. వికసిత్ భారత్ సంకల్పయాత్రకు సంబంధించిన అంశాలను పొందిపరిచిన నూతన సంవత్సర కాలెండర్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను గ్రామీణ ప్రజల ముంగిట్లోకి తేవడం జరిగిందని వికసిత్ భారత్ సంకల్పయాత్ర నిర్వహించడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా ఎల్ఈడీ స్క్రీన్‌పై ప్రజలకు అవగాహన కల్పించారు. ఉపాధి హామీ పథకం, జీవనజ్యోతి పలు పథకాల ద్వారా పేదలకు అనేక ప్రయోజనాలు చేకూరుతున్నాయని వివరించారు. ఈ కార్యక్రమంలో సర్పంచు బద్దం సుగుణ, కార్యదర్శి ప్రశాంత్‌కుమార్, బోగ గంగాధర్, అధికారులు పాల్గొన్నారు.

## కేటీఆర్‌ను కలిసిన నాయకులు



మాజీ మంత్రి కేటీఆర్‌తో బీఆర్ఎస్ నాయకులు

కోరుట్ల రూరల్, జనవరి 8 : బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్‌ను సోమవారం కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్, మాజీ ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావు స్థానిక ప్రజాప్రతినిధులతో హైదరాబాదులో కలిశారు. ఈ సందర్భంగా స్థానికంగా నెలకొన్న రాజకీయాల గురించి వివరించారు. కేటీఆర్ స్థానిక నాయకులతో సమన్వయంతో మెలుగాలని సూచించినట్లు నాయకులు తెలిపారు. కార్యక్రమంలో కోరుట్ల పట్టణ అధ్యక్షుడు అన్నం అనిల్ కుమార్, మండల అధ్యక్షుడు, మాదాపూర్ సర్పంచ్ దారిశెట్టి రాజేష్, మెట్‌పల్లి ఎంపీపీ మారుసాయిరెడ్డి, కౌన్సిలర్లు జిందం లక్ష్మీనారాయణ, గంధ్రాలయ కమిటీ జిల్లా మాజీ డైరెక్టర్ సురేష్ గౌడ్ నాయకులు గోపాల్, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీ, వార్డు కౌన్సిలర్లు ఉన్నారు.

## సదరం క్యాంపులో ఎక్కువ పరీక్షలు చేయాలి

కోరుట్ల, జనవరి 8: సదరం క్యాంపులో వికలాంగుల గుర్తింపు కోసం ఎక్కువ మందిని పరీక్షించాలని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు జువ్వాడి కృష్ణారావు కోరారు. సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ యాస్మిన్ భాషాను కలసి వినతిని అందించారు. ఈ సందర్భంగా కోరుట్ల పట్టణంలోని జువ్వాడి భవనంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో జువ్వాడి కృష్ణారావు మాట్లాడారు. ప్రతీరోజు సదరం శిబిరంలో కేవలం 20 మంది వికలాంగుల పేర్లు నమోదుచేసి పరీక్షలను నిర్వహించడంతో వికలాంగులు ఇబ్బందులు ఎదుర్కోంటున్నారన్నారు. ఎక్కువ మందికి పరీక్షలు నిర్వహించి వారి ఇబ్బందులు తొలగించాలని అన్నారు. కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న జువ్వాడి కృష్ణారావు

# గడప గడపకు శ్రీరాముని అక్షింతలు

### రాములోరి అక్షింతలు స్వీకరించడం పూర్వజన్మ సుకృతం

### బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు డాక్టర్ బోగ శ్రావణి ప్రవీణ్







జగిత్యాలలో రాములోరి అక్షింతలు అందజేస్తున్న బోగ శ్రావణి, బీజేపీ నాయకులు, కోరుట్ల, మెట్‌పల్లిలో శోభాయాత్ర నిర్వహిస్తున్న మహిళలు

జగిత్యాల అర్బన్, జనవరి 8: శ్రీరామ జన్మభూమి తీర్థక్షేత్ర ట్రస్ట్ వారి ఆధ్వర్యంలో అందించిన రాములోరి అక్షింతలు స్వీకరించడం పూర్వజన్మ సుకృతంగా భావిస్తున్నామని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు డాక్టర్ బోగ శ్రావణిప్రవీణ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని కృష్ణానగర్ బస్తీలో భక్తమార్కండేయ దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం అయోధ్య రాములోరి అక్షింతలను గడప గడపకు వితరణ చేశారు. అనంతరం శ్రావణి మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా ఉన్న హిందూ బంధువుల కల అయోధ్యలో రాములోరి విగ్రహ ప్రతిష్ట ఈ నెల 22న నిర్వహించనుండడంతో నెరవేరబోతుందన్నారు.

రామజన్మభూమిలో బాల రాముడు కొలువుదీరబోతు న్నాడన్నారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకొని శ్రీరాముడి ఆశీర్వదంగా వచ్చిన పూజ అక్షింతలను మన ఇంట్లోని పూజ మందిరంలో ఉంచి జనవరి 22వ తేదీ వరకు పూజించి వాటిని ఆరోజు ఆశీర్వాదంగా తీసుకోవాలని, అదే రోజున ప్రతి ఇంటిలో దీప ప్రమిదలను వెలిగించి, శ్రీరామనామం జపం చేయాలని ప్రజలను కోరారు. ఆ సీతారామ చంద్రుల కృపతో జగిత్యాల నియోజకవర్గం సస్యశ్యామలంగా ఉండాలని, ప్రజలు సుఖసంతోషాలతో తులతూగాలని కోరారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు, కృష్ణానగర్ బస్తీ మహిళలు, యువకులున్నారు.

### ఇంటింటా శ్రీరాముని అక్షింతలు పంపిణీ

**ధర్మపురి:** ధర్మపురి మండలంలోని 14 వ వార్డులో శ్రీరాముని అక్షింతలను సోమవారం ఇంటింటా పంపిణీ చేశారు. అక్షింతల వితరణ కార్యక్రమంలో భాగంగా వీహెచ్‌పీ నేతలు, సభ్యులు కరీంనగర్ డీసీఎంఎస్ చైర్మన్ ఎల్లాల శ్రీకాంత్‌రెడ్డి, ధర్మపురి ఏఎంసీ చైర్మన్ అయ్యోరు రాజేష్ ఇంటికి వెళ్లి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పలవురు మహిళలు మంగళహారతులు పట్టుకుని ఇంటింటికి వెళ్లి అక్షతలు పంపిణీ చేశారు. మండలంలోని తీగలధర్మారం గ్రామంలో కూడ ఇంటింటా అక్షింతలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో తీగలధర్మారం సర్పంచ్ అయిల్నేని అండాళు-ప్రభాకర్‌రావు, మాజీ సర్పంచులు జంగిలి ప్రభాకర్, పందరి తిరుపతి, శ్రీరామజన్మ భూమి తీర్థ యాత్ర ట్రస్ట్ సభ్యులు పిల్లి శ్రీనివాస్, రంగు లక్ష్మి నరహరి, కస్తూరి రాజన్న, దుర్గప్రసాద్, గాజు భాస్కర్, కాశెట్టి విజయ్, బెజ్జారపు లవణ్, ఆసం సురేష్, స్తంభంకాడి మహేష్ పాల్గొన్నారు.

**కొడిమ్యాల:** మండల కేంద్రంలో గత ఎనిమిది రోజులుగా శ్రీ రామజన్మ భూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ నుంచి వచ్చిన అయోధ్య రామ అక్షింతలను కర సేవకులు పంపిణీ చేస్తున్నారు. సోమవారం మండల కేంద్రంలోని రామాలయంలో, మండలంలోని నర్సింహులపల్లిలో అంజనేయస్వామి ఆలయంలో పండితులు అక్షింతలను పూజలు చేశారు. అనంతరం గ్రామ సర్పంచు తిరుపతి ఆధ్వర్యంలో గ్రామ యువకులు అక్షింతలను పంపిణీ చేశారు. కొడిమ్యాలలోని ఆలయం నుంచి గ్రామంలో ఇంటింటికి తిరుగుతు అక్షింతలను కరసేవకులు శ్రీనివాస్, దేవేందర్, రామస్వామి, అంజయ్య, రామచంద్రం పంపిణీ చేశారు.

**మల్యాల:** అయోధ్య రాముని అక్షింతలను మండలంలోని రామన్నపేట తదితర గ్రామాల్లో గడపగడపకు అందజేశారు. ఈ సందర్భంగా భక్తులు అక్షింతలతో శోభయాత్ర నిర్వహించారు. సర్పంచ్ జలజ మల్లారెడ్డి, బొడిగే సురేష్, రమేష్‌రెడ్డి, సురేష్, రమేష్, రాజిరెడ్డి భక్తులు పాల్గొన్నారు.

### రాములోరి అంక్షింతలతో శోభాయాత్ర

**కథలాపూర్:** అయోధ్యలో ఈ నెల 22న రామాలయం ప్రారంభిస్తున్న నేపథ్యంలో గ్రామపంచాయతీకి పంపిన రాములోరి అక్షింతలతో గ్రామస్థులు శోభాయాత్ర నిర్వహించారు. భూషణరావుపేట, తాండ్ర్యాల గ్రామాల్లో తలంబ్రాలతో పుర వీధుల వెంట ఊరేగించారు. రామాలయాల నుంచి డప్పు చప్పుళ్లతో అంక్షింతలతో ఊరేగింపు తీసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో సర్పంచు సులోచన, వైస్ ఎంపీపీ గంధ్ర కిరణ్‌రావు, భక్తులు ఉన్నారు.

### హిందూ ధార్మిక సంఘ నాయకుల శోభాయాత్ర

**కోరుట్ల:** పట్టణంలోని పలు వార్డులలో రాములోరి అక్షింతలతో శోభయాత్ర నిర్వహించారు. ఈ నెల 22న అయ్యోధ నగరంలో శ్రీరాములవారి విగ్రహ ప్రతిష్ఠాపక కార్యక్రమంలో భాగంగా ప్రత్యేకం పూజలు అందుకున్న అక్షింతలు కోరుట్ల పట్టణానికి చేరుకోగా పట్టణంలోని బీజేపీ, బీజేవైఎం, విశ్వహిందు పరిషత్, ఆర్ఎస్ఎస్, ఏబీవీపీ, హిందు దార్మిక సంఘ నాయకులు ఆయా వార్డులలోని దేవాలయాలలో ప్రత్యేక పూజలను నిర్వహించి వార్డులో శోభయాత్రను నిర్వహించి ఆహ్వాన పత్రికను అందించారు. ఈ సందర్భంగా ఇంటికి వచ్చిన అక్షింతలను గృహిణీలు మంగళ హారతులతో స్వాగతం పలికారు.

**కోరుట్ల రూరల్:** మండలంలోని చిన్నమెట్‌పల్లి, వెంకటాపూర్, మోహన్‌రావుపేట గ్రామాలలో రాములోని అక్షంతలకు గ్రామస్థులు బాజబజేంత్రీలతో స్వాగతం పలికారు. అక్షంతలను గ్రామంలోని ఆలయాలలో ప్రత్యేక పూజలను నిర్వహించిన గ్రామస్థులు శోభయాత్రలను జరిపారు. ఇంటింటింకి అక్షింతలను పంపిణీ చేయగా మహిళలు మంగళ హారతులతో స్వాగతం పలికారు. గామస్థులు పాల్గొన్నారు.

**మెట్‌పల్లి:** అయోధ్యలో పూజలందుకున్న అక్షింతలతో సోమవారం మెట్‌పల్లి పట్టణంలో శోభయాత్రను నిర్వహించి ఇంటింటికీ అందజేశారు. కోయల్కర్ లింగేశ్వర్ ఆధ్వర్యంలో రాముల వారి అక్షింతలను ఆలయంలోని ప్రత్యేక పూజలు చేసి రామ సంకీర్తనలు, భజనలు నిర్వహించి వార్డుల్లోకి శోభయాత్రగా బయలు దేరారు.

శోభాయాత్రలో మహిళలు మంగళహారతులతో స్వాగతం పలికారు. ఈ కార్య క్రమంలో నాయకులు కోయల్‌కార్ లింగేశ్వర్, స్రవం తి, రమేష్, దానవీని అంజయ్య, భక్తులు పాల్గొన్నారు.

**మల్లాపూర్:** మండల కేంద్రంతో పాటు వేంపల్లి, మొగిలిపేట తదితర గ్రామాల్లో సోమవారం అయోధ్య శ్రీరామ జన్మ భూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ నుంచి వచ్చిన ప్రాణ ప్రతిష్ట అక్షింతలు, రాములోరి ఫొటో, కరపత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు, యువకులు, మహిళలు, భక్తులు, పలు సంఘాల నాయకులు, సభ్యులు పాల్గొన్నారు.

## అంబర్‌పేట ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు

బీర్‌పూర్, జనవరి 8: జగిత్యాల జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన బీర్‌పూర్ శ్రీ లక్ష్మీనరింహస్వామి సన్నిధిలో అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో ఎమ్మెల్యేకు స్వాగతం పలికి ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలను అందించారు. ఆయన వెంట గోనె ప్రదీప్‌రావు, గోనె రమణరావు, నరేందర్‌రావు, అనిల్‌రావు, అర్చకులు పాల్గొన్నారు.

## విద్యార్థినులకు అభినందన

జగిత్యాలరూరల్, జనవరి 8: జిల్లా కేంద్రంలోని జ్యోతి హైస్కూల్‌లో ఆంధ్రజ్యోతి ఆధ్వర్యంలో నిర్వహించిన ముగ్గుల పోటీల్లో తెలంగాణ సాంఘిక సంక్షేమ మహిళ డిగ్రీ కళాశాలకు చెందిన డిగ్రీ విద్యార్థినులు సంగీత, రుచిత, సాత్విక, మేఘన, నితీష కన్సోలేషన్ బహుమతులు గెలుపొందినట్లు కళాశాల ప్రిన్సిపాల్ గోలి శ్రీలత తెలిపారు. ఈ సందర్భంగా బహుమతులు గెలుపొందిన విద్యార్థినులను కళాశాల ప్రిన్సిపాల్ సోమవారం అభినందించారు. కళాశాల కల్చరల్ ఇన్‌చార్జి వేముల శరణ్య పాల్గొన్నారు.

## క్యాలెండర్ ఆవిష్కరణ

రాయికల్, జనవరి 8: మండంలోని భూపతిపూర్ సహకార సంఘం క్యాలెండర్-2024ను సోమవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ ఏనుగు ముత్యంరెడ్డి, భూపతిపూర్ సర్పంచ్ చంద్రశేఖర్, సొసైటీ వైస్‌చైర్మన్ నాగుల మల్లయ్య గౌడ్, డైరెక్టర్లు కోసరి మహేష్, అంజిత్, కొమ్ము గంగరాజం, గంగరాజు, భారతి, శేఖర్ రెడ్డి, సంఘ కార్యదర్శి చంద్రశేఖర్, సిబ్బంది పాల్గొన్నారు.

## సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలి

మెట్‌పల్లి, జనవరి 8: ఉపాధ్యాయుల సమస్యలను సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి త్వరగా పరిష్కరించేందుకు చొరవ చూపాలని టీపీసీసీ సీనియర్ ఉపాధ్యక్షుడు మల్లు రవికి పీఆర్‌టీయూ తెలంగాణ నాయకులు కోరారు. సోమవారం హైదరాబాద్‌లోని ఆయన కార్యాలయంలో పుష్పగుచ్ఛం అందజేసి ఉపాధ్యాయుల సనమస్యల పరిష్కరానికి సహకరించాలని కోరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అర్ధాంతరంగా నిలిచిపోయిన ఉపాధ్యాయ బదిలీలు, పదోన్నతులు, టెట్ లేకుండా పదోన్నతులకు మినహాయింపు ఇవ్వాలని, 317జీవో బాధిత ఉపాధ్యాయుల బదిలీలు చేపట్టాలని కోరినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పీఆర్‌టీయుటీఎస్ జిల్లా అధ్యక్షుడు నర్సింగరావు, ప్రధాన కార్యదర్శి నరుకుల్ల శ్రీధర్, సభ్యులు పాల్గొన్నారు.

## అయోధ్య నుంచి భక్తుల పాదయాత్ర



పాదుకలను మోస్తున్న భక్తులు

కొడిమ్యాల, జనవరి 8: జిల్లాలోని ప్రముఖ పుణ్య క్షేత్రమైన కొండగట్టు గిరి ప్రదక్షణ గురువు సురేష్ ఆత్మరాం మహారాజ్ ఆద్వర్యంలో సుమారు 20 మంది రామ భక్తులు మూడు రోజుల క్రితం మండలంలోని పూడూర్ గ్రామ మార్కండేయ ఆలయం నుంచి అయోధ్యకు బయలు దేరారు. శనివారం రాత్రి శ్రీరాముని పాదుకలను శిరస్సుపై పెట్టుకొని తెలంగాణకు తిరుగు ప్రయాణమయ్యారు. సుమారు 1250 కిలో మీటర్ల దూరం పాదయాత్రగా రాముని పాదుకలను తెలంగాణలోని కొండగట్టుకు రామభక్తులు నెత్తిపై మోసుకొని వచ్చి ఆలయ పరిసరాల్లో పాదుకలను అయోధ్యలో శ్రీరాముని ప్రాణప్రతిష్ఠ జరిగే సమయానికి ఈ నెల 22న పట్టాభిషేకం చేయటానికి గురువు సంకల్పించినట్లు పలువురు భక్తులు ఆదివారం సాయంత్రం తెలిపారు. కార్యక్రమంలో గురువుతో పాటుగా చిలుకూరు, మండలంలోని పూడూర్, జిల్లాలోని కొండగట్టు, ముత్యంపేట, పోతారం, తిప్పయ్యపల్లి, గోలిరామయ్యపల్లి, మంచిర్యాల, సంగారెడ్డి, తదితర ప్రాంతాలకు చెందిన భక్తులు ఉన్నారు.

## నేరెళ్ల సాంబశివుని ఆలయ వార్షికోత్సవం



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ సతీమణి

ధర్మపురి, జనవరి 7: ధర్మపురి మండలంలోని నేరెళ్ల గ్రామంలోని శ్రీ సాంబశివుని ఆలయ వార్షికోత్సవం సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు స్వామి వారికి అభిషేకం, ప్రత్యేక పూజలు, తీర్థ ప్రసాద వితరణ కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు అత్యంత భక్తి శ్రద్ధలతో పూజలు చేసి స్వామి వారిని దర్శనం చేసుకున్నారు. బీసీ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు, ధర్మపురి మండల కాంగ్రెస్ అధికార ప్రతినిధి జాజాల రమేష్ రూపొందించిన 2024 నూతన సంవత్సర క్యాలెండర్, డైరీని వేదపండితులు శివ శ్రీప్రశాంత్ శాస్త్రి స్వామి సన్నిధిలో ఉంచి పూజలు నిర్వహించారు. అనంతరం క్యాలెండర్, డైరీని ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే సతీమణి కాంతాకుమారి చేతుల మీదుగా ఆవిష్కరించారు. అనంతరం భక్తులకు ఆమె పంపిణీ చేసి క్యాలెండర్ ముద్రించిన జాజాల రమేష్‌ను ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా జాజాల రమేష్ ఆధ్వర్యంలో పలువురు సభ్యులు ఎమ్మెల్యే సతీమణి కాంతాకు మారిని శాలువా కప్పి సన్మానం చేశారు. కార్యక్రమంలో నేరెళ్ల సాంబ శివుని ఆలయ కమిటీ చైర్మన్ కాసారపు రాజాగౌడ్, గోవింద్‌పల్లె సర్పంచ్ పురంశెట్టి రాజయ్య, ఎంపీటీసీ రెడ్డవేని సత్యం, ఆలయ కమిటీ మాజీ చైర్మన్ కాశెట్టి మల్లేశం, బొంతల సత్యనారాయణ, అరబిందో పాఠశాల కరస్పాం డెంట్ జాజాల రవీందర్, ధర్మపురి పీఏసీఎస్ వైస్‌చైర్మన్ షేర్ల రాజేశం, శ్రీ రాజ రాజేశ్వర స్వామి దేవస్థానం చైర్మన్ జంగిలి తిరుపతి, కాసారపు బాలాగౌడ్, పురంశెట్టి మల్లేశం, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## మధ్యాహ్న భోజనానికి సరుకుల అందజేత

మల్యాల, జనవరి 8: మల్యాల ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థుల మద్యాహ్న బోజనం కోసం మల్యాలకు చెందిన దొంతరవేణి శేఖర్ అనే యువకుడు బోజనం తయారి సరుకులు అందజేశారు. బియ్యంతో పాటు నూనె, పప్పు దినుసులు అందించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శివరామకృష్ణ అద్యాపకులు రచన, సంధ్య, అత్తినేని శ్రీనివాస్‌లతో పాటు యువకులు కీసరి గణేష్, అలంకార్, రఘు, అనిరుధ్, వేణు పాల్గొన్నారు

## ఘనంగా గోదాదేవి రంగనాథుల కల్యాణం

ఇబ్రహీంపట్నం, జనవరి 8: మండలంలోని యామపూర్ వేంకటేశ్వరస్వామి ఆలయంలో గోదాదేవి రంగనాథులు కల్యాణం కన్నుల పండువగా నిర్వహించారు. అర్చకులు చక్రపాణి మాధవచార్యులు ప్రత్యేక పూజలు, అర్చన, అభిషేకలు నిర్వహించి కన్నుల పండువగా కల్యాణం నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ తలారి మనీష-ఆనంద్, వీడీసీ సభ్యులు పాల్గొన్నారు.

## రాజన్న ఆలయ వార్షికోత్సవం

పెగడపల్లి, జనవరి 8: మండల కేంద్రంలోని స్వయంభూ రాజరాజేశ్వరస్వామి ఆలయ వార్షికోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. కోరిన కోర్కెలు తీర్చే రాజన్నగా పేరు గాంచిన ఆలయ వార్షికోత్సవాన్ని సోమవారం అర్చకులు గుండి శ్రీనివాస శర్మ, వినయ్ శర్మలచే ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఉపసర్పంచ్ ఐలేని విద్యాసాగర్ రావు కుటంబ సభ్యులు భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ మేరుగు శ్రీనివాస్, ఆలయ కమిటీ చైర్మన్ భూమాడి గంగారెడ్డి, బైర పోచయ్య, పార్థసారథి, కిషన్‌రావు, కొమురెల్లి, సుదాకర్, నర్సింహారెడ్డి, శాంతపురావు పాల్గొన్నారు.

## గ్రామపంచాయతీగా ఏర్పాటు చేయాలి

పెగడపల్లి, జనవరి 8: మండలంలోని ఏడుమోటలపల్లి తండాను గ్రామ పంచాయతీగా ఏర్పాటు చేయాలని తండాకు చెందిన ఎస్టీ యూనియన్ ధర్మపురి నియోజకవర్గ అధ్యక్షుడు ఎన్ జీవన్‌నాయక్ సోమవారం జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. జిల్లా కేంద్రంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో ఏడుమోటలపల్లి తండా ప్రజలు నిత్యం గ్రామపంచాయతీగా వెల్లాలంటే 2 కిలోమీటర్లు వెల్లాల్సి వస్తుందన్నారు. తండాను గ్రామపంచాయతీగా ఏర్పాటు చేసి తండా ప్రజల ఇబ్బందులు తీర్చాలని వినతిపత్రంలో కోరారు.

## ఆర్థిక సహాయం

గొల్లపల్లి, జనవరి 8: మండలంలోని శ్రీరాములపల్లె గ్రామానికి చెందిన వెంకటేష్ ధర్మపురి మండల కేంద్రంలోని పెట్రోల్ బంక్ సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాలపాలయ్యాడు. ప్రస్తుతం వెంకటేష్ హైదరాబాద్‌లోని నిమ్స్‌లో చికిత్స పొందుతున్నాడు. రెక్కాడితేగానీ డొక్కాడని స్థితిలో ఉన్న వెంకటేష్ కుటుంబం రాంచందర్ రెడ్డిని కలువగా సోమవారం ఐదు వేల ఆర్థిక సహాయం అందించారు. ఈ సందర్భంగా తమ కుటుంబానికి అండగా నిలిచిన రాంచందర్ రెడ్డికి బాధిత కుటుంబసభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

## ఎమ్మార్పీఎస్ నాయకులకు సన్మానం

గొల్లపల్లి, జనవరి 8: మండల కేంద్రంలో ఇటీవల నూతనంగా ఎన్నికైన ఎమ్మార్పీఎస్ కార్యవర్గానికి సోమవారం మండల కాంగ్రెస్ నాయకుడు కిష్టంపేట రమేష్ రెడ్డి సన్మానం చేశారు. కార్యక్రమంలో అధ్యక్షుడు చెవులమద్ది రమేష్, ఓరగంటి జాన్, మ్యాక స్వామి, బెక్కం గంగారాం, రెడపాక లింగయ్య, బెక్కం రాజయ్య, ముల్కల శ్రీనివాస్, తడగొండ విజయ్ కుమార్ పాల్గొన్నారు.

## సరస్వతీ దేవి విగ్రహావిష్కరణ

రాయికల్, జనవరి 8: మండలంలోని చెర్లకొండాపూర్‌లో సరస్వతీదేవి విగ్రహావిష్కరణ కార్యక్రమం సోమవారం నిర్వహించారు. గ్రామానికి చెందిన అల్లకొండ సుదర్శన్-పద్మ దంపతులు సరస్వతీదేవి విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. గ్రామంలోని ప్రభుత్వ పాఠశాల ఎదురుగా ఈ విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో విగ్రహ దాత మాజీ సర్పంచ్ అల్లకొండ సుదర్శన్-పద్మ, సర్పంచ్ ఆకుల రాజ్యలక్ష్మి-లక్ష్మీనారాయణ, విద్యా కమిటీ చైర్మన్ మానాల వెంకటేష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ఫాగింగ్ చేయాలి

రాయికల్, జనవరి 8: రాయికల్ పట్టణంలో వీధి వీధిన పారిశుధ్యం లోపించడం వలన దోమల బెడద ఏర్పడిందని, దీని కోసం ఫాగింగ్ చేయాలని కాంగ్రెస్ నాయకులు సోమవారం మున్సిపల్ కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. పట్టణవాసుల ఆరోగ్యరీత్యా తక్షణమే చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పట్టణ కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

# ఎంపీపీ పీఠం కోసం క్యాంప్ రాజకీయం

● గత నెల 11న ఆర్డీవోకు అవిశ్వాస తీర్మానం నోటీసు అందజేత ● హైదరాబాద్ క్యాంప్‌నకు ఎంపీటీసీల తరలింపు

● నేడు ఆర్డీవో ఆధ్వర్యంలో అవిశ్వాసంపై సమావేశం

వెల్గటూర్, జనవరి 8: వెల్గటూర్ ఎంపీపీ పీఠం కైవసం చేసుకునేందుకు కాంగ్రెస్‌కు చెందిన ఓ ఎంపీటీసీ క్యాంప్ రాజకీయానికి తెరలేపారు. బీఆర్ఎస్ పార్టీకి చెందిన వెల్గటూర్ ఎంపీపీ కూనమల్ల లక్ష్మి, వైస్ఎంపీపీ ముస్కు కవితపై అవిశ్వాసం ప్రకటిస్తూ గత నెల 11న పలువురు ఎంపీటీసీలు తీర్మానం నోటీసును ఆర్డీవోకు అందజేశారు. ఈ నేపథ్యంలో ఎంపీటీసీలను కుటుంబ సభ్యులతో సహా హైదరాబాద్ క్యాంప్‌నకు తరలించారు. దీనితో ఎంపీపీ పీఠం ఎవరికి దక్కుతుందోనని మండలంలో సర్వత్రా ఉత్కంఠకు దారితీస్తోంది. ఎంపీటీసీల క్యాంప్ రాజకీయం సర్వత్రా చర్చనీయాంశంగా మారింది. బీఆర్ఎస్ పార్టీకి చెందిన ఎంపీపీ, వైస్ ఎంపీపీలపై పది మంది ఎంపీటీసీలు జాడి సుజాత, యండీ బషీర్, రంగు తిరుపతి, అనుమాల్ల మంజుల, గొల్లపల్లి శ్రీజ, చాటకొల్లు మల్లేశ్వరి, సప్ప జ్యోతి, లక్కాకుల రాణి, పొడేటి సత్తయ్య, నక్క పూజిత సంతకాలు చేసిన అవిశ్వాస తీర్మానం నోటీసును ఆర్డీవోకు అందజేశారు. అప్పటి నుంచి మండలంలో ఎంపీపీ పీఠంపై జోరుగా చర్చసాగుతోంది.





### ● ప్రభుత్వం మారగానే అవిశ్వాసంపై అడుగులు..

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వారం రోజుల్లోనే ఎంపీపీ లక్ష్మిపై అవిశ్వాస తీర్మానం పెట్టడానికి సభ్యులు అడుగులు వేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో అనూహ్యంగా ఎంపీపీ పీఠాన్ని కైవసం చేసుకున్న లక్ష్మి ప్రభుత్వం మారగానే పరిస్థితులు మారిపోయాయి. మండలంలోని 15 ఎంపీటీసీ స్థానాలకు గాను గత ఎన్నికల్లో ఎనిమిది మంది బీఆర్ఎస్, నలుగురు కాంగ్రెస్, ముగ్గురు ఇండిపెండెంట్ ఎంపీటీసీలుగా ఎన్నికయ్యారు. ఇండిపెండెట్లుగా గెలుపొందిన అంబారిపేట ఎంపీటీసీ జాడి సుజాత కాంగ్రెస్‌లో చేరగా కాంగ్రెస్ బలం 5కు చేరగా, కొత్తపేట ఎంపీటీసీ నక్క పూజిత, స్తంభంపల్లి ఎంపీటీసీ పొడేటి సత్తయ్య బీఆర్ఎస్‌లో చేరడంతో బీఆర్ఎస్‌లో చేరగా బీఆర్ఎస్ బలం 10కి చేరింది.

### ● అటుఇటుగా మారిన సమీకరణాలు..

అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ నుంచి అధికారాన్ని కాంగ్రెస్ హస్తగతం చేసుకోవడంతో సమీకరణాలు అటుది ఇటుగా మారిపోయాయి. రాష్ట్రంలో ప్రభుత్వం మారగానే పలువురు ఎంపీటీసీలు పార్టీ మారారు. బీఆర్ఎస్‌కు చెందిన గుల్లకోట ఎంపీటీసీ గొల్లపెల్లి శ్రీజ, కిషన్‌రావుపేట ఎంపీటీసీ సప్ప జ్యోతి, పైడిపెల్లి ఎంపీటీసీ సాటకొల్లు మల్లేశ్వరి, పాతగూడర్ ఎంపీటీసీ లక్కాకుల రాణి కాంగ్రెస్‌లో చేరడంతో కాంగ్రెస్ బలం 10కి చేరగా, కాంగ్రెస్‌కు చెందిన రాజారాంపల్లి ఎంపీటీసీ గాజుల మలేశం ఎన్నికలకు ముందే బీఆర్ఎస్‌లో చేరారు. దీనితో బీఆర్ఎస్ బలం ఐదుకు పడిపోయింది.

### ● నేడు ప్రత్యేక సమావేశం

ఎంపీపీ కూనమల్ల లక్ష్మి, వైస్ఎంపీపీ ముస్కు కవితపై పది మంది ఎంపీటీసీలు కలిసి ఆర్డీవోకు అవిశ్వాస తీర్మాణ నోటీసు అందజేసిన నేపథ్యంలో ఆర్డీవో నర్సింహమూర్తి ఆధ్వర్యంలో మంగళవారం మండల పరిషత్ కార్యాల యంలో ప్రత్యేక సమావేశం నిర్వహించనున్నారు. మండల పరిషత్ కార్యాల యంలో ఉదయం 10.30కు నిర్వహించే ప్రత్యేక సమావేశానికి హాజరు కావాలని సభ్యులకు అధికారులు నోటీసులు జారీ చేశారు. మొత్తానికి ఎంపీపీ ఎవరు ఎంపిక అవుతారనే విషయం మండలంలో చర్చనీయాంశంగా మారింది. ఎంపీపీ స్థానం ఎస్సీ మహిళకు రిజర్వ్ కాగా అంబారిపేట ఎంపీటీసీ జాడి సుజాత ఎంపీపీగా ఎన్నికయ్యే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని చర్చ జోరుగా సాగుతోంది.